సంక్షేమ పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- వలంటీర్లకు ఎమ్మెల్యే ఎలీజా పిలుపు
- ఉత్తమ వలంటీర్లకు పురస్కారాల అందజేత


వలంటీర్‌కి పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న పురస్కారాలను ఎమ్మెల్యే ఎలీజా చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 నుంచి వలంటీర్లు పరిపాలనలో భాగస్వాములై ప్రజలకు విస్తృతమైన సేవలను అందిస్తున్నారని అన్నారు. అవార్డులు అందుకున్న వలంటీర్లతో పాటు అవార్డులు రాని వారిని కూడా అభినందిస్తున్నామన్నారు. అవార్డులు రాని ఏ ఒక్కరూ నిరుత్సాహానికి గురికావద్దని, ప్రతి వలంటీర్ క్షేత్రస్థాయిలో సమానమైన సేవలు అందిస్తున్నారని, మనమంతా జగనన్న సైనికులమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పరిపాలనను ప్రజల్లో తీసుకెళ్లే విధంగా మరింత కష్టపడాలన్నారు. గత ప్రభుత్వాల్లో సేవలు పొందాలంటే అధికారుల వద్దకు ప్రజలు వెళ్లేవారని. కానీ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ప్రత్యేకాధికారి ఎం.రాజు, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, తహసీల్దార్ స్లీవజోజి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మధుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలవరంలో 2కే వాక్


పోలవరంలో 2కే వాక్ నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ దోహదపడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరంలో శనివారం 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన 2కే వాక్ ఏటిగట్టు మీదకు చేరుకుని ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అటవీశాఖాధికారులు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, సచివాలయ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న అప్పారావు

జంగారెడ్డిగూడెం : స్థానిక 27వ వార్డులో ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందిన తణుకు శ్రీను కుటుంబానికి అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు సహాయం అందించారు. శ్రీను కుటుంబ సభ్యులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నెక్కు గణేష్, ఫౌండేషన్ అధ్యక్షుడు గుజ్జేటి మల్లేశ్వరరావు, చాటపర్తి పోసిబాబు, రూపా దేవి, కానూరి రాము, చాటపర్తి సాయినాథ్, పోసిబాబు, మెట్ట సత్యనారాయణ, పితాని సత్యనారాయణ, కొండపల్లి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్ వద్ద జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెంకు చెందిన రామ వినాయ కోలాట భజన మండలి బృందం గురువు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారి భక్తి కీర్తనలతో, భజన పాటలతో చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా కోలాట బృందం సభ్యులను అభయాంజనేయ స్వామి కమిటీ సత్కరించింది.

చేతిరాత పోటీలు


చేతిరాత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు చేతి రాత (హ్యాండ్ రైటింగ్) పోటీలను నిర్వహించారు. నిర్దేశించిన సమయంలో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా చక్కటి చేతిరాతతో పరీక్షలు రాసే విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరడానికి చక్కటి చేతి రాత ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, వి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని అరెస్ట్ చేయాలి

జంగారెడ్డిగూడెం : అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ క్రీడా విజయ పతాకాన్ని రెపరెపలాడించిన మహిళా మల్లయోధుల (రెజ్లర్ల)పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, యూపీ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా రెజ్లర్లు, వారికి మద్దతుగా క్రీడాకారులు ఢిల్లీలో సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా మద్దతు ప్రకటించాలన్నారు.

ఏలూరు జూట్ కార్మికులకు అండగా ఉంటాం

ఏలూరు (టూటౌన్) : ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు రాష్ట్ర పౌరహక్కుల సంఘం అండగా ఉంటుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌వీ రత్నం తెలియజేశారు. జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుని నేడు రోడ్డున పడేసి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. మిల్లు నడపలేకపోతే చట్టబద్ధమైన జీతాలు, బెనిఫిట్స్, నష్టపరిహారం కార్మికులకు తక్షణమే చెల్లించాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మిల్లు మూసివేయడం స్టాండింగ్ ఆర్డర్స్‌కి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం కార్మికుల జీవనోపాధికి రక్షణ కల్పించాలన్నారు. భవిష్యత్తులో కార్మికులు చేసే పోరాటానికి పౌరహక్కుల సంఘం మద్దతు తెలియజేస్తుందని శ్రీమన్నారాయణ, కేవీ రత్నం తెలిపారు.

పారిజాతగిరిలో పూజలు


శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి, అష్టోత్తర పూజలు అర్చకస్వాములు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలికే సర్వేశ్వరరావు, పద్మావతి, ఎస్.రామమూర్తి, కె.బాపిరాజు, రావిపాటి వీవీ సుబ్బారావు కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కంది బాలకృష్ణారెడ్డి, రెడ్డిరంగప్రసాద్, ఈవో మానికల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో జగన్‌కు సుస్థిరస్థానం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- ఎ.పోలవరం, చిన్నంవారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


చిన్నంవారిగూడెంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, చిన్నంవారిగూడెం గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గ్రామ స్థాయిలోనే వెల్‌నెస్ సెంటర్లు, రైతుభరోసా, సచివాలయాలు ఇలా అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం మెరుగైన సేవలను ప్రజలకు అందిస్తుందన్నారు. మహిళలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు, నామినేటెడ్ పదవుల్లో కూడా అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేస్తూ వచ్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల సాధక, బాధలు తెలుసుకుని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హామీలన్నీ నెరవేర్చారన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని అనేక పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అందిస్తున్న మెరుగైన విద్యాబోధనతో పాటు, నాడు-నేడులో కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చూసి ఇక్కడ చదివేందుకు పోటీ పడుతున్నారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఉప సర్పంచ్ కోమటి నాగు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ నాయకులు బండారు సుబ్బారావు, బెజవాడ నాగరాజు, బుద్దాల అనిల్, కొట్టే భద్రరావు, వెలుగు నాగరాజు, కొట్టే జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గంగానమ్మ జాతర


గ్రామ దేవత శ్రీ గంగానమ్మ తల్లి

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పదిహేను రోజుల పాటు ఈ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాలకు అమ్మవారి ఆలయం ముస్తాబైంది. ముఖ్యంగా అమ్మవారికి ప్రీతిపాత్రమైన పూరిపాకను, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. వేగివాడ వంశీయుల పుట్టింటి ఆడపడుచుగా గేలం వంశీయుల వారి మెట్టినింటి ఇల్లాలుగా అమ్మవారు పూజలు అందుకోనున్నారు. ఆదివారం విఘ్నేశ్వర పూజ, గ్రామ శివారులలో పోలిమేర తోరణం కట్టడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 45 ఏళ్ల తరువాత జాతర నిర్వహిస్తుండడంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పచ్చిరొట్ట, నవధాన్యాల కిట్ అందజేత


కొత్తపట్టిసీమలో పచ్చిరొట్ట, నవధాన్యాల కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : భూములు సారవంతంగా తయారయ్యేందుకు రైతులకు 30 రకాల విత్తనాలతో పాటు పచ్చిరొట్ట, మేలు నవధాన్యాల కిట్‌లను అందజేశారు. పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో వరి కుప్పలు కాలిపోయిన భూములకు సంబంధించిన 16మంది రైతులకు ఆర్‌బీకే ఆధ్వర్యంలో ఈ కిట్‌లను శనివారం అందజేశారు. రైతులకు ఈ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ, రంబ శ్రీనివాస్, పూడి వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి వెండి హారం అలంకరణ

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామి వారికి ఏలూరుకు చెందిన ఎన్ఆర్‌వి ఆర్జా మధుమూర్తి దంపతులు రూ.94,364 విలువైన 108 లక్ష్మీరూపులు గల వెండి హారాన్ని సమర్పించారు. శనివారం సంప్రోక్షణ పూజల అనంతరం స్వామి వారికి ఈ హారాన్ని అలంకరించారు. టీటీడీ నిధులతో ఈ ఆలయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆలయ పూజారులు మంగపతి ఆచార్యులు, మోహన కృష్ణాచార్యులు స్వామి వారికి విశేష పూజలు చేసి హారాన్ని స్వామి వారికి అలంకరించారు. అనంతరం దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులకు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోంది



వెంకటపతికుంట చెరువులో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు, రైతు సంఘ నాయకులు

ద్వారకాతిరుమల : ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ధ్వజమెత్తారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో వెంకటపతికుంట చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీ రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కోత పెట్టడమే కాకుండా అనేక నిబంధనలు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. రెండు పూటల పని విధానం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫోటో సిస్టమ్ వలన అనేక సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి ఏడాదికి 200 రోజులు పనులు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, వెంట్రపాటి పోతురాజు, అయినపర్తి మునమ్మ, పదిలం కృష్ణారావు, బూరా భవాని, కట్టా నాగమణి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం



కొమ్ముగూడెం సెంటర్‌లో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, నేలకూలిన చెట్లు

బుట్టాయగూడెం : పశ్చిమ మన్యంలో శుక్రవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. తీవ్రమైన గాలులకు పలుచోట్ల వృక్షాలు, చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. బుట్టాయగూడెం కొమ్ముగూడెం సెంటర్‌లో మర్రిచెట్టు కొమ్మ విద్యుత్ వైర్లు, స్తంభాలపై పడటంతో శుక్రవారం రాత్రి 10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు విరిగిన కొమ్మలతో పాటు స్తంభాలను కూడా తొలగించి శనివారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలకు కరెంట్ సేవలు నిలిచిపోవడంతో నానా అవస్థలు పడ్డారు. అయితే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు కృషి చేయడంతో వారిని ప్రజలు అభినందించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని డిమాండ్

జంగారెడ్డిగూడెం : స్థానిక 6, 7, 8, 9 వార్డులలో సుదీర్ఘ కాలంగా ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత మూడు రోజులుగా ఈ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి వేసవి కాలంలో ఓల్టేజ్ సమస్యతో ఎస్సీ పేట, జగజ్జీవన్ రామ్ నగర్, ముస్లీం పేట, లయోల స్కూల్ రోడ్, 9 వవార్డు కు చెందిన సాయి బాలాజీ టౌన్ షిప్ లోని రెండు రోడ్‌లలో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. 8వ వార్డులో డీఎల్‌పీవో కార్యాలయం వద్ద ఉన్న 160 కేవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువగా ఉన్నందున 100 మీటర్ల దూరంలో మరొక 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ గతంలో వేశారని, అది కూడా సరిపోక విద్యుత్ అధికారులతో మాట్లాడితే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారన్నారు. కానీ ఇప్పటివరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పాత విద్యుత్ లైన్‌లను మార్చి త్రీ ఫేజ్ సదుపాయం కల్పించాలని అంజితో పాటు కౌన్సిలర్‌లు నేకూరి కిషోర్, దిరిసిపాము ధనలక్ష్మి, సంకు సురేష్ అధికారులను కోరారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



దిప్పకాయలపాడులో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



తాటాకులగూడెంలో పర్యావరణంపై అవగాహన కలిగిస్తున్న ఫారెస్టు అధికారులు

కొయ్యలగూడెం : దిప్పకాయలపాడు గ్రామంలో శనివారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం కన్నాపురం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్యావరణ ప్రాముఖ్యతపై రేంజర్ కృష్ణకుమారి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచులను నిషేధించి జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా స్థానికులు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ సున్నం శాంత కుమారి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్నాపురం అటవీ సెక్షన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కట్టుబడి ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వి.ధర్మారావు అన్నారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ శాఖ సిబ్బంది శనివారం జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం గ్రామ సచివాలయం వద్ద పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అలాగే ఉపాధి కూలీలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు ఏపీ రాఘవులు, లలితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు బాధ్యతగా వాహనాలను నడపాలి


భద్రత అంశాలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విష్ణువర్ధన్

కొయ్యలగూడెం : డ్రైవర్లు బాధ్యతతో విధులు నిర్వహించగలిగితే అనేక ప్రమాదాల నుంచి బయటపడవచ్చు అని ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ గ్రౌండ్ ఆవరణలో టాక్సీ, ఆటో, ట్రాక్టర్, లారీ తదితర వాహనాలకు సంబంధించిన డ్రైవర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించడం, వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగం లేకుండా ఉండడం, ముఖ్యంగా మద్యపానం సేవించకుండా ఉండడం వల్ల ప్రయాణికులను ప్రమాదాల నుంచి కాపాడవచ్చు అన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలతో ప్రయాణం చేయాల్సి వస్తే వారి సమాచారం తమకు గాని వారి సంబంధీకులకు గాని ముందుగానే చేరవేయాలని ఆదేశించారు.

అక్రమాలపై విచారణ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి, అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ కోరారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరుతూ డ్వామా పీడీ ఏ.రాముకు శనివారం వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సైట్ సూపర్‌వైజర్లను నియమించాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిచాలన్నారు. చనిపోయిన కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. వేతనం రూ.272 వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకం సరఫరా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి శనివారం కోరారు. ఉద్యోగులు ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సత్యసాయి సేవా సంస్థలు గోదావరి తాగునీటి పథకాన్ని నిర్మించి ప్రభుత్వానికి అప్పగించారని, ప్రభుత్వం అప్పట్లో నిర్వహణ బాధ్యతలు ఎల్అండ్‌టీ కంపెనీకి అప్పగించిందన్నారు. 150 మంది ఉద్యోగులకు 75 రోజులు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్ట్ నుంచి ఎల్అండ్‌టీ తప్పుకుందని, అనంతరం కొత్త కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం నియమించినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేమని, వేరే పనులు చూసుకోని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా పోలవరం, బుట్టాయగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సుమారు వందకు పైగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. బకాయి జీతాలు చెల్లించి ఉద్యోగులకు పని భద్రత కల్పించాలని రవి కోరారు.

పాడి రైతులకు హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు

కుకునూరు : పాడి రైతులకు చేయూతను అందించే విధంగా పశువుల కొనుగోలుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సాయి బుచ్చారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పాడి రైతుకు మూడు పశువులకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పశువులకు రుణం పొందాలంటే ఒకొక్క పశువుకి రూ.30 వేల చొప్పున రూ.90 వేల రుణాలు తీసుకోవచ్చని, కొత్తగా పశువు కొనుగోలు చేయాలనుకుంటే ఒకొక్క పశువుకు రూ.60 వేలు చొప్పున రూ.1.80 లక్షలు తక్కువ వడ్డీపై ఎటువంటి పూచీకత్తులు లేకుండా వ్యక్తిగత రుణం మంజూరు చేసేందుకు బ్యాంకు సమాయత్తం అయినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రాంతీయ పశు వైద్యశాఖల పరిధిలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. నగరంలోని జన్మభూమి పార్కును ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో జన్మభూమి పార్కులో ప్లాంటేషన్‌తోపాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్కులు పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేయటంతోపాటు, సుందరీకరణ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ పలు సచివాలయాలను సందర్శించారు. సచివాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈలు సత్యనారాయణ, తాతబాబు, విద్యుత్ ఏఈ శేషగిరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.